సాక్షి కర్నూలు

సోమవారం। 21। అక్టోబర్। 2024



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు.



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: ఆలయ నిత్యకళారాధన వేదికపై ఆదివారం ఒంగోలుకు చెందిన శివన్రత్య కళానిలయం వారి సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,631.91
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.421
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:51,587
అవుట్ ఫ్లో	:51,407

న్యూస్‌రీల్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులు అందజేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ ప్రజల ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు వివరించారు.

నేడు ఏపీఈఆర్‌సీ సమావేశం

కర్నూలు న్యూసిటీ: నగరశివారులోని దిన్నెదేవరపాడు సమీపంలో ఉన్న ఏపీఈఆర్‌సీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏపీ ట్రాన్స్‌కో స్టేట్ కో-ఆర్డినేషన్ ఫోరమ్ సమావేశం జరుగనుంది. ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ సి.వి. నాగార్జునరెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి జెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధర్‌బాబు, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, డిస్కంల సీఎండీలు పట్టనశెట్టిరవి, ఐ.పృథ్వీతేజ్, కె.సంతోషరావు, ఎన్‌టీపీసీ తదితర సంస్థల ఉన్నతాధికారలు హాజరుకానున్నారు. 2024-25 నుంచి 2028-29 సంవత్సరం వరకు రాష్ట్ర విద్యుత్ ప్రణాళిక ఆమోదంతో పాటు ఇతర అంశాలపై చర్చించే అవకాశం ఉంది.

తుంగభద్ర పరవళ్లు



నాగలదిన్నె బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది

నందవరం: ఎగువన కురిసిన వానలకు తుంగభద్ర నదికి వరద నీటి చేరికతో పరవళ్లు తొక్కుతోంది. రెండు రోజుల క్రితం తుంగభద్ర డ్యామ్ నుంచి 83 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం నాగలదిన్నె బ్రిడ్జి వద్ద వరద నీరు ఉరకలు వేస్తోంది. తీర ప్రాంత రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను ఒడ్డుకు చేర్చారు. నది తీర ప్రాంతాలైన నదికైరవాడి, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి గ్రామాలలోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు



సి.నాగరాజు



లక్ష్మీరాజు

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సి.నాగరాజు, ఎం.లక్ష్మీరాజును ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వి.గిరికుమార్‌రెడ్డి ఇటీవల రాజీనామా చేయడంతో నూతన అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు ఆదివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఎన్నిక కోసం రాష్ట్ర కమిటీ నుంచి ఉపాధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి అబ్జర్వర్‌గా హాజరయ్యారు. ఆయన ఆధ్వర్యంలో సి.నాగరాజును అధ్యక్షుడిగా ఎం.లక్ష్మీరాజును కార్యదర్శిగా ఎన్నుకున్నారు. మరోవైపు ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.రజనీకాంత్‌రెడ్డిని నియమించారు.





➤ 'ఏమండీ.. పాపకు దగ్గు ఎక్కువైంది.. ఇంటికొచ్చేటప్పుడు మెడికల్ షాప్‌లో సిరప్ తీసుకురండి' ఆఫీసులో ఉన్న భర్తకు భార్య ఫోన్.



➤ 'అన్నా.. రెండు రోజులుగా ఒళ్లు నొప్పులు పెయిన్ కిల్లర్ ట్లాబెట్ ఇవ్వండి' మందుల షాప్ వద్ద ఓ యువకుడు.



➤ 'జలుబు తగ్గడం లేదా.. అయితే ఫలానా మాత్ర వేసుకో ఇట్టే తగ్గిపోతుంది. అంటూ స్నేహితుడికి ఓ వ్యక్తి ఉచిత సలహా..

ఇలా ప్రతి ఒక్కరూ డాక్టర్ అయిపోయి ఎవరికి వారే సొంతంగా మందులు వాడటం రోజు రోజుకు పెరిగిపోతోంది. చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లలేక.. అలాగని ప్రైవేటు వైద్యుల వద్దకు వెళితే ఖర్చు అధికం అవుతుందని భావించి నేరుగా మెడికల్‌షాపులకు వెళ్లి మందులు కొని ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. వైద్యుల సలహాలు, సూచనలు లేకుండా సొంతంగా మందుల వినియోగం ప్రమాదకరమని హెచ్చరిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు.

సొంత వైద్యమే జబ్బు



- సాధారణ జబ్బులకు సొంత వైద్యమే
- కొద్దిగా లక్షణాలు కనిపిస్తే చాలు మాత్రలు మింగిస్తున్నారు
- ఓర్చుకునే తత్వం కోల్పోయిన జనం
- విశ్రాంతినిస్తే శరీరంలో నయం చేసుకునే గుణం
- ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల దుకాణాల్లో విక్రయాలు
- వైద్యుల సూచన లేకుండా వాడితే ఇబ్బందులు

కర్నూలు(హాస్పిటల్): ఏదైనా జబ్బు తగ్గాలంటే డాక్టర్ కంటే ముందు మెడికల్‌షాపునకు వెళ్లేవారు ఇటీవల అధికమయ్యారు. దుకాణానికి వెళ్లి వ్యాధికి సంబంధించిన లక్షణాలు చెబితే చాలు పెట్టెలోంచి మందులు తీసి ఇవ్వడం ఇటీవల చాలా దుకాణాల్లో పరిపాటిగా మారింది. నిపుణులైన ఫార్మాసిస్టు ఇస్తే ఫర్వాలేదు గానీ.. తెలిసీ తెలియని పరిస్థితుల్లో మందులు ఇచ్చే వారితోనే సమస్య. కొన్నిసార్లు వారిచ్చిన డోసు అధికం కావడం, వారికి ఆయా మందులు పడకపోవడం, రియాక్షన్స్ రావడం తదితర కారణాలతో ప్రాణాల మీదకు తెస్తున్నాయి. కర్నూలు జిల్లాలో 1,700, నంద్యాల జిల్లాలో 1,300 మెడికల్‌షాపులు ఉన్నాయి. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలో మరో 700కు పైగా హోల్‌సేల్ దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఇందులో కేవలం గత మూడేళ్ల కాలంలోనే 300కు పైగా దుకాణాలు కొత్తగా ఏర్పడ్డాయి. కోవిడ్ సమయంలో ప్రజలు వైద్యుల వద్దకు కంటే మెడికల్‌షాపులకు వెళ్లి మందులు కొని వాడటం ఎక్కువగా ఉండేది. ఆ సమయంలో విపరీతంగా మందుల దుకాణాల్లో లూజు కౌంటర్ విక్రయాలు జరిగాయి. అప్పటి నుంచి కౌంటర్ సేల్ విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. సాధారణంగా కొన్ని రకాల మందులను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇవ్వకూడదు. కానీ అన్ని రకాల మందులను సైతం మెడికల్‌షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు. ఏ మందు ఎలా పనిచేస్తుంది, దేనికి పనిచేస్తుంది, ఎలాంటి పరిస్థితుల్లో అతనికి ఆ మందు పనిచేస్తుంది, అతని/ఆమె వయస్సు, తగిన డోసు తదితర విషయాలు వైద్యునితో పాటు నిపుణుడైన ఫార్మాసిస్టుకు మాత్రమే తెలుస్తుంది. కానీ కొన్ని దుకాణాల్లో ఫార్మాసిస్టు ప్రమేయం లేకుండానే నేరుగా మందులు విక్రయిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒంట్లో ఏదైనా నలత ఏర్పడితే ఆ వ్యాధి కంటే దాని కయ్యే ఖర్చుకే రోగి భయపడుతున్నాడు. రోగి వ్యాధి లక్షణాలను బట్టి వైద్యం చేసే వైద్యుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. నాడీ పట్టుకుని ఏ వ్యాధి వచ్చిందో, ఎందుకు వచ్చిందో చెప్పే వైద్యులు భూతద్దం పెట్టి వెతికినా కనిపించడం లేదు. ఇప్పుడంతా వ్యాధినిర్ధారణ పరీక్షల చికిత్స కొనసాగుతోంది. సంబంధిత పరీక్షలు చేయించుకుని వచ్చిన తర్వాత గానీ చికిత్స మొదలు పెట్టడం లేదు. సాధారణ జలుబు, దగ్గు, జ్వరంతో వెళ్లినా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రాథమిక వైద్యపరీక్షల ఖర్చులే రూ.2వేలు దాటుతోంది. ఇక వైద్యుల కన్సల్టేషన్, మందుల ఖర్చు మరో రూ.1000ల వరకు ఉంటోంది. అందుకే వైద్యుని కంటే నేరుగా మెడికల్‌షాపులకు వెళ్లి చికిత్స చేయించుకునే వారే ఎక్కువయ్యారు.

యథేచ్ఛగా మందుల విక్రయాలు

ప్రస్తుతం చాలా మంది ఒంట్లో ఏదైనా నలతగా ఉంటే తెలిసిన మెడికల్ షాపునకు వెళ్లి మందులు తెచ్చుకుని వాడుతున్నారు. అయితే జలుబు, దగ్గు, జ్వరం, నొప్పుల వరకు అయితే ఓకే గానీ కొన్నిసార్లు యాంటిబయాటిక్స్, తీవ్రమైన స్టెరాయిడ్స్, నొప్పుల మాత్రలు కూడా రోగులకు విక్రయిస్తున్నారు. కర్నూలులోని కొన్ని దుకాణాల్లో మత్తు కలిగించే మందులు, ఇంజెక్షన్లు కూడా వాటికి బానిసైన వారికి విక్రయిస్తున్నారు. దీనికితోడు దగ్గు సిరప్‌లను అధిక శాతం విక్రయించే దుకాణాలు సైతం నగరంలో ఉన్నాయి. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని మెడికల్‌షాపుల్లో పరిస్థితి చెప్పనవసరం లేదు. వీటికి బానిసైన వారికి మెడికల్‌షాపుల వారు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అతిగా వాడితే ప్రాణాంతకం

చాలా మంది దీర్ఘకాలిక జబ్బులున్నవారు మొదట వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స తీసుకుంటున్నారు. ఆ తర్వాత మళ్లీ డాక్టర్ వద్దకు వెళ్లకుండా ఏళ్ల తరబడి అవే మందులను మెడికల్‌షాపుల్లో కొని వాడుతూ ఉన్నారు. మందులు వాడటం వల్ల కొన్నిసార్లు సదరు వ్యాధి తీవ్రత పెరిగి ఉండవచ్చు లేదా తగ్గి ఉండవచ్చు. దీనిని బట్టి మళ్లీ వైద్యుల వద్దకు వెళితే డోసును అడ్జస్ట్ చేసి ఇస్తారు. అలాంటి పరిస్థితుల్లో మందులు వాడితే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ వైద్యుల సూచన లేకుండా ఎడా పెడా మందులు కొని వాడితే అది మొదటికే మోసం చేస్తుంది. మరీ ముఖ్యంగా యాంటిబయాటిక్స్ అతిగా వాడితే శరీరం వాటికి అలవాటు పడిపోయి కొత్త రకం యాంటిబయాటిక్స్ కోసం ఎదురుచూస్తుంది. లైంగిక ఉత్ప్రేకాలు అతిగా వాడితే అవి గుండె, కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. పెయిన్ కిల్లర్స్, స్టిరాయిడ్స్ అతిగా వాడితే భవిష్యత్‌లో కడుపులో పుండ్లు, కాలేయ సమస్యలు, కిడ్నీ సమస్యలు వస్తాయి. పీరియడ్స్ రావడానికి, పీరియడ్స్ వాయిదా పడేందుకు వాడే మందులు సైతం వైద్యుల సూచన లేకుండా వాడకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించొద్దు



వైద్యుల సూచన మేరకు మాత్రమే ప్రతి ఒక్కరూ మందులు కొని వాడాలి. నేరుగా మందులు కొని వాడితే అవి కొన్నిసార్లు సైడ్ ఎఫెక్ట్ ఇచ్చి ప్రాణం మీదకు వచ్చే అవకాశం ఉంది. మెడికల్‌షాపుల వారు సైతం వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించడం నేరం. ఇలాంటి విక్రయాలు చేసే దుకాణాలపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. ప్రతి దుకాణదారుడు వారి మందుల విక్రయాలల్లో బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలి. ఏ మందును ఎవరికి విక్రయించారో బిల్లు బుక్‌లో లేదా ఆన్‌లైన్‌లో చూపించాలి.

–హరిహరతేజ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, కర్నూలు

నొప్పుల మాత్రలు అతిగా వాడితే కిడ్నీలకు ప్రమాదం



చాలా మంది సమీప దుకాణాలకు వెళ్లి నొప్పుల మాత్రలు కొని వాడటం మనం చూస్తుంటాము. ఎప్పుడో ఒకసారైతే ఇబ్బంది లేదు గానీ ప్రతిరోజూ ఇదే విధంగా నొప్పుల మాత్రలు, స్టెరాయిడ్స్ కొని వాడితే మాత్రం ఇబ్బందులు తప్పవు. దానివల్ల కడుపులో అల్సర్లు ఏర్పడమే గాకుండా కిడ్నీలు కూడా ఫెయిలవుతాయి. కొన్నిసార్లు డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి వస్తుంది. వైద్యుల సూచన లేకుండా ఎలాంటి మందులు వాడకూడదు. ప్రతి మందుకూ సైడ్ ఎఫెక్ట్ ఉంటుంది. ఏ మందు ఎవరికి ఎలా పనిచేస్తుందో వైద్యులకు మాత్రమే తెలుస్తుంది.

– డాక్టర్ వెంకటపక్కిరెడ్డి, నెఫ్రాలజిస్టు, జీజీహెచ్, కర్నూలు

రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి



సీ.క్యాంపు రైతుబజారులో విక్రయదారులతో మాట్లాడుతున్న జేసీ నవ్య

కర్నూలు(అగ్రికల్చర్): రైతుబజార్లలో రైతులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం కర్నూలులోని సి.క్యాంపు రైతుబజారును జేసీ తనిఖీ చేశారు. దాదాపు గంటన్నరకు పైగా రైతుబజారును మొత్తం పరిశీలించారు. రైతుబజారులో దళారీలను గుర్తించే ప్రయత్నం చేశారు. ఏ గ్రామం.. ఎన్ని ఎకరాల భూమి ఉంది... ఏఏ కూరగాయలు పండిస్తున్నారు. భూమి లేకపోతే కూరగాయలు ఎక్కడి నుంచి తెస్తున్నారు. గుర్తింపు కార్డు ఉందా.. అంటూ ఆరా తీశారు. పాదుపు మహిళలతో మాట్లాడుతూ... 'మీరు ఏఏ రకాల కూరగాయలు అమ్ముకుంటున్నారు.. ఎక్కడి నుంచి తెస్తున్నారు. రోజుకు రైతుబజారుకు ఎంత చెల్లిస్తున్నారు వంటి వివరాలు తెలుసుకున్నారు. బోర్డుపై రాసిన ధరలకే కూరగాయలు విక్రయిస్తున్నారా... తూకాలు సక్రమంగా ఉంటున్నాయా... ఇంకా ఏవైన ఇబ్బందులు ఉన్నాయా అంటూ వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. వంట నూనెల కౌంటరును కూడా పరిశీలించారు. రైతుబజారు విస్తరణ గురించి కూడ మార్కెటింగ్ శాఖ అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి, డీఈ రఘురామిరెడ్డి, ఎస్టేట్ అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం



ఫెన్సింగ్ ఆడుతున్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఎస్‌జీఎఫ్ అండర్-17 ఫెన్సింగ్ బాలబాలికల రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభం సందర్భంగా డీఈఓ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కాగా 13 జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు, 50 కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి శ్రీనాథ్, డీఐ అస్మద్దీన్, ఎంఈఓలు బ్రహ్మంనాయక్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక అధికారులు

కర్నూలు (టౌన్): ప్రజా సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుంది. అయితే, ఈ కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తుతున్నాయి. పలువురు మండల స్థాయిలో తమ సమస్య పరిష్కారం కాలేదని జిల్లా కేంద్రానికి వస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రజాఫిర్యాదులను పరిశీలించి పరిష్కారమయ్యేలా చూసేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారులను నియమించారు. ఆదోని, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాలకు ఆదోని సబ్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్‌ను, పత్తికొండతో పాటు కృష్ణగిరి, వెల్దుర్తి, మద్దికెర, తుగ్గలికి పత్తికొండ రెవెన్యూ డివిజనల్ అధికారి భరత్ నాయక్, కోడుమూరుకు సంబంధించి కర్నూలు రూరల్, సి.బెళగల్, కోడుమూరు, గూడూరు మండలాలకు కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. సందీప్‌కుమార్, కర్నూలుకు సంబంధించి కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఎస్. రవీంద్రబాబు, మంత్రాలయంతో పాటు పెద్దకడబూరు, కోసిగి, కౌతాళం మండలాలకు హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ విశ్వనాథ్, దేవన కొండ, హొళగుంద, హాలహర్వి, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి మండలాలకు హెచ్ఎస్ఎస్ఎస్ యూనిట్-4, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్, పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు, ఓర్వకల్ మండలాలకు ఎస్ఎస్‌పీ స్పెషల్ కలెక్టర్ సీవీ నారాయణమ్మను నియమించారు.

ఉపాధి కరువై.. ఊరికి దూరమై!



టెంపో వాహనంలో వలస వెళ్తున్న కూలీలు

- పల్లెల నుంచి తరలివెళ్తున్న వలస బండ్లు
- ఒక్క రోజే 1,500 మంది వలసబాట
- ఇళ్లకు తాళాలు.. పిల్లలతో సహా పయనం
- ఖాళీ అవుతున్న గ్రామాలు

కోసిగి: వ్యవసాయ పనులు ముగియడంతో ఊర్లకు ఊర్లే వలసబాట పడుతున్నాయి. సొంతూరిలో ఉపాధి కరువై బతుకుబాట పడుతున్నారు. నెలల తరబడి అక్కడే ఉండేలా తిండిగింజలు, బట్టలు, వంటపాత్రలు వెంట తీసుకుని బయలుదేరుతున్నారు. పిల్లాపాపలతో కలిసి మూట ముల్లె సర్దుకుని పనులు వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. ఇళ్లకు తాళాలు వేసుకుని బడికి వెళ్లే పిల్లలను సైతం చదువు మానిపించి తమ వెంట తీసుకెళ్తున్నారు. కోసిగి మండలంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 30 పైగా టెంపోలలో 1,500 మందికి పైగా కూలీలు కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు తరలి వెళ్లారు. మండల కేంద్రం కోసిగి కొండుగానీ వీధి, చింతలగేని, కింద మారెమ్మ దేవి, కడపాళెం, కాశమ్మ గడ్డ, 1వ వార్డులోని బాయ్స్ హైస్కూల్ వెనుక భాగం కాలనీ, విద్యుత్ సబ్ స్టేషన్ సమీప కాలనీ, రామక్కమ్మ కాలనీల నుంచే కాక దుద్ది, ఆర్లబండ, కామన్‌దొడ్డి, పెద్దకడబూరు మండలంలోని గవిగట్టు, పీకలబెట్ట, బాపుల దొడ్డి గ్రామాల నుంచి కూలీలు వలస వెళ్లారు. ఇందులో కొందురు కర్ణాటక రాష్ట్రంలోని సైదాపూర్, గబ్బూర్, మటమారి, మర్చటాల్ ప్రాంతాలకు మరి కొందరు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు బయలుదేరి వెళ్లారు. ఇళ్లకు తాళాలు వేసుకుని పిల్లలను సైతం తమ వెంట తీసుకెళ్లారు.

పత్తి పొలాల్లో పనులకు..

బతుకుదెరువు కోసం వెళ్లిన ప్రాంతాల్లో పత్తి పొలాల్లో పనులు ఉంటాయని కూలీలు పేర్కొంటున్నారు. ఒక కేజీ పత్తి తీస్తే రూ.12 ధర చొప్పున చెల్లిస్తారని, ఒక్కొక్కరు రోజుకు రూ.1000 పైగా వేతనం పడేలా పత్తి ఏరి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. తమ వెంట తీసుకెళ్లిన పిల్లలతో పాటు కుటుంబమంతా పనులు చేసుకుని డబ్బు సంపాదించుకుంటున్నట్లు వెల్లడించారు. గ్రామంలోనే ఉంటే పనులు దొరకక పోగా కుటుంబ పోషణ భారం అవుతోందని చెబుతున్నారు. ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించినా పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా కూలీలు గిట్టుబాటు కావడం లేదన్నారు. ప్రతి ఏటా వర్షం కాలం ముగిసి వెంటనే కొన్నాళ్ల పాటు వలస వెళ్లి డబ్బులు సంపాదించుకుని మరలా గ్రామాలకు చేరుకుంటామని తెలిపారు.

వెళ్లిన చోట జీవనం దుర్భరం..

వలస ప్రాంతాల్లో వెళ్లిన చోటు జీవనం దుర్భరంగా సాగించాల్సి ఉంటుంది. పొలాల్లోను గుడారాలు వేసుకుని, మరికొన్ని ప్రాంతాల్లో పొలాల యజమానుల షెడ్‌లలో నివసిస్తూ కాలం గడుపుతారు. ఉన్న గ్రామాల్లోనే పుష్కలంగా పనులు దొరికితే అక్కడకు వెళాల్సి దుస్థితి ఉండదని కూలీలు చెబుతున్నారు. బడికి వెళ్లే పిల్లలు మధ్యలోనే బడి మానిపించి తీసుకెళ్లి మళ్లీ వచ్చిన తర్వాత పాఠశాలలో చేర్పిస్తారు. ఇలా ప్రతి ఏటా యథావిధిగా కూలీలు బతుకు జీవనం కొనసాగిస్తున్నారు.

పిల్లలతో సహా వెళ్తున్నాం




పనుల కోసం భార్య పిల్లలతో కలిసి కర్ణాటక రాష్ట్రం సైదాపూరంకు వెళ్తున్నాం. పిల్లలతో కలిసి పత్తి ఏరే పనులు చేసుకుని జీవనం సాగిస్తాం. గ్రామంలో ఎలాంటి పనులు లేవు. దొరికినా పెరిగిన ధరలకు గిట్టుబాటు కావడం లేదు. వెళ్లిన చోట కుటుంబం అంతా కష్ట పడి డబ్బులు పొదుపు చేస్తేనే అప్పులను తీర్చుకోగలుగుతాం. ఇక్కడ ఉంటే అప్పులు పెరిగి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మా కుమారుడు 5వ తరగతి చదువుతున్నాడు. వాణ్ణి కూడా వెంట తీసుకెళ్తున్నాం. – శ్రీనివాసులు, కోసిగి

గ్రామంలో పనులు లేవు



మొన్నటి వరకు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకున్నాం. ఇకపై గ్రామాల్లో పను లు దొరకవు. ఉన్నచోట ఉంటే అప్పులు పెరిగిపోతాయి. కుటుంబ గడవడం కష్టంగా మారుతోంది. వలస వెళ్లిన చోటు పుష్కలంగా పనులు దొరుకుతాయి. ప్రతి ఏటా వలస వెళ్లి కటుంబ పోషణ చేసుకుంటాం. గ్రామంలో ప్రభుత్వం కల్పిస్తున్న పనులు గిట్టుబాటు కావడం లేదు. పనులకు వెళ్లి సరైనా వేతనాలు రావడం లేదు. ప్రభుత్వం కూలీలకు శాశ్వత పనులు కల్పించాలి. – ఫక్కీరప్ప, ఉరుకుంద

చిన్న సార్.. పెద్ద దందా!



- సీనియర్ అసిస్టెంట్ అయినా పైరవీలతో ఇన్‌చార్జ్ హోదా
- వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్‌లో దిట్ట
- తాజాగా ఆదోనిలో నకిలీ ఆధార్‌తో అక్రమ రిజిస్ట్రేషన్
- ఈయన హయాంలోనే కల్లూరు, కర్నూలు వక్ఫ్ భూముల గోల్‌మాల్
- చర్యలకు వెనకాడుతున్న ఉన్నతాధికారులు

కర్నూలు(సెంట్రల్): ఆయన ఎక్కడ విధులు నిర్వహిస్తారో అక్కడ అవినీతికి తలుపులు తెరిచి ఉంచాల్సిందే. వివాదాస్పద స్థలాలు, భూములను అవలీలగా చేతులు మార్చగలరనే ఆరోపణలు కోకొల్లలు. అయినా అతనిపై శాఖాపరంగా ఎలాంటి విచారణలు జరగడం లేదు. అతని వెనుక ఆ శాఖ ఉన్నతాధికారులే ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీన నకిలీ ఆధార్‌తో ఏకంగా రూ.2 కోట్ల విలువ చేసే స్థలాన్ని గుట్టుగా రిజిస్ట్రేషన్ చేయడం వెనుక పెద్ద మొత్తంలో చేతులు మారినట్లు తెలుస్తోంది. ఆ కార్యాలయ ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ హాజీమియ్యా తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఈయన సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అతను ప్రస్తుతం డోన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉండాలి. అయితే ఆయన అంటే రిజిస్ట్రేషన్ శాఖలోని ఉన్నతాధికారులకు ఎంత ఇష్టమో తెలియదు కానీ.. ఏదో ఒక చోట ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ హోదాలో నియమించబడుతున్నారు. ప్రస్తుతం ఆదోని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్నారు. గతంలోనూ కర్నూలు, కల్లూరు, అవుకు, డోన్‌లలో ఇన్‌చార్జ్ హోదాలో సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించారు. ఈయన కు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి అండ ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జొహరాపురం బుడాకాన్ మసీదు 154 సర్వే నంబర్ వ్యవహారంలో కర్నూలు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేశారనే ఆరోపణలపై విచారణ జరిపి ఆయనను సస్పెండ్ చేశారు. అయితే ఇదే సర్వే నంబర్‌లో హాజీమియ్యాతోపాటు గతంలో పనిచేసిన పలువురు సబ్ రిజిస్ట్రార్లు అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసినా ఎలాంటి విచారణ జరపకుండా ఉన్నతాధికారులు దాట వేసినట్లు తెలుస్తోంది. పూర్తి స్థాయి విచారణ జరిపితే ఆయన చేసిన అక్రమా లు వెలుగు చూస్తాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

లింకు డాక్యుమెంట్లు లేకుండా రిజిస్ట్రేషన్

ఆదోనిలోని ఎస్‌కేడీ కాలనీలో సర్వే నంబర్లు 380ఏ, 379బీలో వేసిన వెంచర్‌లో 33సీ అనే ప్లాటును1984లో కురువ హనుమంతమ్మ కొనుగోలు చేసింది. దాదాపు 40 ఏళ్లుగా వారి అధీనంలోనే రికార్డుల్లో ఉంది. అయితే ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అనుచరుడు దంతవైద్యుడు రవికిరణ్ ఆ స్థలంపై కన్నేసి తన తల్లి జయలక్ష్మి పేరును కురువ హనుమంతమ్మగా ఆధార్‌లో మార్పించి ఈనెల 16వ తేదీన రిజిస్ట్రేషన్ చేశారు. అయితే రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ఆధార్‌లో స్థలం కొనుగోలు చేసిన వ్యక్తి పేరు ఉండడంతో మాత్రమే సబ్ రిజిస్ట్రార్ ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఆస్తికి సంబంధించి లింకు డాక్యుమెంట్ లేకుండానే ఈ ప్రక్రియ ముందుకు సాగడం వెనుక ఆయన పాత్ర కీలకమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతోపాటు పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారి ఉంటాయనే తెలుస్తోంది.

నిషేధిత జాబితాలోని భూములు సైతం రిజిస్ట్రేషన్...

కర్నూలు, కల్లూరు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా హాజీమియ్యా చాలా కాలం పనిచేశారు. ఆ సమయంలో ఆయన కల్లూరు, కర్నూలు పరిధిలో విలువైన వక్ఫ్ భూములను ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. సర్వే నంబర్ 154-1లోని జొహరాపురం బుడాకాన్ మసీదు భూములు, కల్లూరు పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీ, ఉల్చాల, ఇందిరాగాంధీనగర్, ఎన్‌టీఆర్ నగర్ పరిధిలోని 121, 122, 123, 124, 340, 344 సర్వే నంబర్లలో వందలాది సంఖ్యలో అక్రమ రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు తెలుస్తోంది. ఆయా సర్వే నంబర్లన్నీ నిషేధిత జాబితాలో ఉన్నాయి. మరోవైపు కర్నూలు రూరల్ మండలం మునగాలపాడులోని 154, 155 సర్వే నంబర్లలో కూడా ఆయన ఇన్‌చార్జ్‌గా సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో రిజిస్ట్రేషన్‌లు జరిగాయి.

క్లుప్తంగా

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


పావని (ఫైల్)

ఆదోని అర్బన్: భర్త, అత్త, ఆడపడుచు వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ఆదోనిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అమరావతినగర్‌కు చెందిన శ్రీనివాసులుకు వాల్మీకినగర్‌కు చెందిన పావనికి 2021లో పెద్దలు పెళ్లి చేశారు. శ్రీనివాసులుకు ఇది రెండో సంబంధం. వారికి ఎనిమిది నెలల కుమార్తె కావ్య సంతానం. గత కొన్ని రోజుల నుంచి పావనిపై భర్త అనుమానం పెంచుకున్నాడు. దీంతో రోజూ భర్తతో పాటు అత్త లక్ష్మి, ఆడపడుచు సుశీలమ్మ వేధింపులకు గురి చేసేవారు. మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. స్థానికులు సమాచార మేరకు పోలీసులు వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసులు వాటర్ వర్క్స్‌లో లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి చెందిన బాలిక ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వివరాలు.. గ్రామానికి చెందిన అభిలాష్ అనే యువకుడి మాయమాటలు నమ్మి బాలిక అతనితో వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాలికను ఎందుకు వెళ్లావంటూ మందలించారు. దీంతో మనస్థాపం చెందిన సదరు బాలిక ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు ప్రభుత్వాసుపత్రికి చేరుకొని ఘటనకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బాలికను తీసుకెళ్లిన పార్లపల్లి గ్రామానికి చెందిన అభిలాష్ అనే యువకుడిపై పోక్సో యాక్ట్, కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు ఆదివారం సాయంత్రం తెలిపారు. తమ కుమార్తెను మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కడుపునొప్పి తాళలేక..

ఆదోని అర్బన్: కడుపునొప్పి తాళలేక మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మాధవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వీరేష్ (40) పొలం పనులు చేస్తూ జీవనం సాగిస్తాడు. శనివారం పొలానికి వెళ్లగా అక్కడ కడుపు నొప్పి ఎక్కువ కావడంతో భరించలేక పురుగుమందు తాగి ఇంటికి చేరుకున్నాడు. భార్య లక్ష్మి గమనించి అడగగా విషయం చెప్పి అపస్మారకస్థితిలో పడిపోయాడు. హుటాహుటిన ఆమె చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వీరేష్ మృతిచెందాడని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వారికి పెళ్లిళ్లు కూడా అయ్యాయి.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఆత్మకూరురూరల్: పట్టణంలోని దుద్యాల రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లో ఆదివారం గుర్తు తెలియని పురుషుడి శవం(45) లభ్యమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలేవీ లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని శవంగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ నారాయణరెడ్డి తెలిపారు.




ఎన్నెన్నో వర్ణాలు.. ఎన్నెన్నో అందాలు

వినీలాకాశంలో అందాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేశాయి. ఆకాశంలో హరివిల్లు ఆవిష్కృతమై సప్తవర్ణ శోభితం విరాజిల్లింది. అప్పటి వరకు వెలుగులు పంచిన భానుడు మేఘాల చాటుకు వెళ్లగా నల్లటి మబ్బులు కరిగి వాన కురిసింది. ఆదివారం సాయంత్రం కర్నూలు గణేష్ నగర్‌లో కనిపించిన ఈ దృశ్యాలను పలువురు ఆస్వాదించారు. ఎన్నెన్నో వర్ణాలు.. ఎన్నెన్నో అందాలు అంటూ హామ్ చేశారు. – సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

దొంగల ముఠా అరెస్ట్

- జల్సాలకు అలవాటుపడి బైక్‌లు చోరీ
- ఆరుగురి సభ్యుల ముఠాలో ముగ్గురు మైనర్లు
- వీరంతా వైఎస్సార్ జిల్లాకు చెందినవారే


స్వాధీనం చేసుకున్న బైక్‌లు, దొంగలను చూపిస్తున్న ఆళ్లగడ్డ డీఎస్పీ

కోవెలకుంట్ల: జల్సాలకు అలవాటు పడి సులభతరంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడి బైక్‌లు చోరీ చేస్తున్న దొంగల ముఠాను కోవెలకుంట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ నిందితుల వివరాలను వెల్లడించారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు ఉసేన్‌వలి, ప్రొద్దుటూరు షేక్ ఫజిల్, మైదుకూరుకు వాదనపల్లి అమీర్‌బాషాతో పాటు మరో ముగ్గురు మైనర్లు ఎనిమిది నెలల నుంచి ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లో బైక్‌లు చోరీ చేసి వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. విజయవాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం ప్రాంతాల్లో ఉన్న బైక్‌లను ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి పెట్టిన వాటి ఆర్‌సీ డౌన్‌లోడ్ చేసుకుని చోరీ చేసిన బైక్‌లను మోటారుసైకిల్ ఇంజిన్‌నంబర్, చాసిస్ నంబర్లను మార్పు చేస్తున్నారు. కొత్త ఆర్‌సీ తయారు చేసి ఓనర్ సెల్ నంబర్ మార్చి అమాయకులను ఎంచుకుని రూ.1.20 లక్షల విలువ చేసే బైక్‌ను రూ.40 వేలకు విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సా చేస్తున్నారు. కోవెలకుంట్ల సాయినగర్‌లో ఈనెల 16న అర్ధరాత్రి దూదేకుల దస్తగిరికి చెందిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దుండగులు అపహరించుకెళ్లారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దొంగల కోసం గాలించి కేసు మిస్టరీని ఛేదించారు. కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ కృష్ణనాయక్, కానిస్టేబుళ్లు మాలిక్, వెంకటేష్‌నాయక్, సుధీర్, సుబ్బరాయుడు, హోంగార్డు చెన్నయ్య చాకచక్యంగా వ్యవహరించి బైక్‌ల చోరీ దొంగలను పట్టుకున్నారు. ఆయా జిల్లాల్లో తొమ్మిది పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీ చేసిన 11 బైక్‌లతోపాటు నాలుగు నకిలీ రిజిస్ట్రేషన్‌కార్డులు, సెల్‌ఫోన్, లాప్‌టాప్, డ్రిల్లింగ్ మిషన్, తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని డీఎస్పీ వివరించారు. చోరీకి పాల్పడిన ఆరుగురు దొంగలను కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

ప్రజలపై రూ.20 వేల కోట్ల విద్యుత్ బాదుడు


జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకుడు

కర్నూలు(సెంట్రల్): అధికారంలో లేని సమయంలో బాదుడే బాదుడు అన్న కూటమి నేతలు 100 రోజుల్లోనే ప్రజలపై విద్యుత్ చార్జీల రూపంలో రూ.20 వేల కోట్ల భారం వేసేందుకు సిద్ధమవ్వడం హేయమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. ఆదివారం నగరంలోని 32వ వార్డు సుందరయ్య నగర్‌లో మహాసభ నిర్వహించారు. ముందుగా ఆటో స్టాండ్ దగ్గర పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ..రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా నివారణకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. నూనెలు, బియ్యం ధరలు ఆకాశన్నంటుతున్నాయని అన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీల అమలుకు పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దావీదు, విజయకుమార్ పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఇద్దరి దుర్మరణం
- మరో మహిళకు తీవ్ర గాయాలు



లక్ష్మీరాం, చరణ్‌రాజ్ (ఫైల్)

తాడిపత్రి/యాడికి: ఆర్టీసీ బస్సు బైకును ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. తాడిపత్రి మండల పరిధిలోని చుక్కలూరు గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం ఈ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సీఐ శివ గంగాధర్ రెడ్డి తెలిపిన మేరకు.. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం బిజినవేముల గ్రామానికి చెందిన చరణ్‌రాజ్ (30), మనీషా దంపతులు. వీరికి సంతానం లేదు. చరణ్‌రాజ్ సోదరి సుమిత్రని యాడికి మండల కేంద్రానికి చెందిన రాముడికి ఇచ్చి వివాహం చేశారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చరణ్‌రాజ్ దంపతులు రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం యాడికి వచ్చి నివాసముంటున్నారు. రెండు కుటుంబాలూ మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాయి. బత్తలపల్లి మండలం మద్దలపల్లిలోని తమ బంధువుల ఇంట్లో ఆదివారం పుట్టు వెంట్రుకల కార్యక్రమానికి చరణ్‌రాజ్, రాముడు కుటుంబాలు వెళ్లాయి. వేడుక ముగిసిన అనంతరం చరణ్‌రాజు, మనీషా దంపతులు బైకుపై, రాముడు, మరికొంత మంది కారులో స్వగ్రామం బయలుదేరారు. ఈ క్రమంలోనే రాముడు చిన్న కుమారుడు లక్ష్మీరాం (8) తన మేనమామ చరణ్‌రాజ్ బైకులో వస్తానంటూ మారాం చేయటంతో బాలుడిని చరణ్‌రాజ్ తన బైక్‌పై ఎక్కించుకుని ముందుకు కదిలాడు. తాడిపత్రి మండలం చుక్కలూరు గ్రామ సమీపంలో వెళ్తున్న వీరిని గుత్తి నుంచి తాడిపత్రి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన చరణ్‌రాజ్, బాలుడు లక్ష్మీరాం ఘటనాస్థలిలోనే ప్రాణాలు వదిలారు. తీవ్రగాయాలైన మనీషాను స్థానికులు 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రమాద ధాటికి బాలుడు లక్ష్మీరాం చేయి, కాలు తెగిపడ్డాయి. చరణ్‌రాజ్ కాలు కూడా తెగిపడటంతో ఆ ప్రాంతం భీతావహంగా మారింది. కాగా, ప్రమాదం సమాచారం అందుకున్న రాముడు, సుమిత్ర దంపతులు ఘటనా స్థలానికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాలను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

నకిలీ ఫోన్‌పేతో మోసం

కర్నూలు (టౌన్): ఉయ్యాలవాడ పోస్టుమెన్‌గా పనిచేస్తూ ఫేక్ ఫోన్‌పేతో మోసాలకు పాల్పడుతున్న ఒక యువకుడిని ఆదివారం రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. బి. తాండ్రపాడుకు చెందిన కార్తీక్ ఉయ్యాలవాడలో పోస్ట్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈజీ మనీకి అలవాటుపడిన ఇతను ఏటీఎం సెంటర్‌ల వద్ద అత్యవసరం ఉంది.. డబ్బులు ఇస్తే ఫోన్ పే చేస్తానని చెప్పి బురిడీ కొట్టిస్తున్నాడు. అకౌంట్‌కు డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయినట్లు కనిపిస్తుందే తప్ప జమ కాదు. ఇలా ఫేక్ ఫోన్‌పేతో అనేక మందిని మోసం చేశాడు. ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో బాధితులు తర్వాత పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. తాజాగా రెండు రోజుల క్రితం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రూ.10 వేలు తీసుకొని ఫోన్ పే చేశాడు. తరువాత ఆ వ్యక్తి అకౌంట్‌లోకి డబ్బు జమ కాలేదు. పోలీసులను ఆశ్రయించడంతో పక్కాగా నిఘా పెట్టి మోసాలు చేస్తున్న కార్తీక్ ను అరెస్టు చేశారు. ఇప్పటి వరకు రూ.1.50 లక్షలు ఫోన్ పే రూపంలో మోసాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని...

కర్నూలు (టౌన్): నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేసిన ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌కు చెందిన సురేష్ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీకి సీఈఓ అని నిరుద్యోగులతో పరిచయం చేసుకుంటాడు. తర్వాత వారికి తన కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు వసూలు చేస్తాడు. ఇలా అనేక ప్రాంతాల నుంచి 95 మంది నిరుద్యోగుల నుంచి రూ.95 లక్షలు వసూలు చేశాడు. ఇందులో కర్నూలు నగరానికి చెందిన నలుగురు యువకులు ఉన్నారు. ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో మోసపోయామని తెలుసుకున్న ఈ నలుగురు బాధితులు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు హైదరాబాద్‌కు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని కర్నూలుకు తెచ్చారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచనున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నట్టల నివారణతో జీవాల్లో ఎదుగుదల

- సగటున 2 కిలోల వరకు బరువు పెరిగే అవకాశం
- ఈ నెల చివరి వరకు నట్టల నివారణ మందులు తాపే కార్యక్రమం


నట్టల నివారణ మందులు తాపుతున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): జీవాల్లో నట్టల బెడద సర్వసాధారణం. నేలకు దగ్గరగా మేత మేయడం వల్ల ఆ సమస్య ఉత్పన్నమవుతుంది. మేత లభ్యం కానప్పుడు, పోషకాల లోపం ఏర్పడినప్పుడు, వానకాలం, అనావృష్టి సందర్భాలు, అంటు వ్యాధులు ప్రబలిన సమయాల్లో ఈ పరాన్న జీవుల బెడద అధికంగా ఉంటుంది. అయితే, సకాలంలో నట్టల నివారణ మందులు తాపితే జీవాల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఎదుగుదల కనిపిస్తోందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపే కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. కర్నూలు జిల్లాలో 14.07 లక్షలు, నంద్యాల జిల్లాలో 11.88 లక్షల సన్న జీవాలు ఉన్నాయి. సన్న జీవాలు ఆరోగ్యంగా బరువు పెరిగితేనే గొర్రెల పెంపకం లాభసాటి అవుతోంది. వైఎస్‌ఆర్‌సీపీ పాలనలో గొర్రెలు, మేకలకు ఏడాదికి మూడు సార్లు నట్టల నివారణ మందులు తాపడం జరిగేది. ఇప్పుడు కొంత ఆలస్యంగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 16వ తేదీన మొదలైన ఈ కార్యక్రమం ఈ నెల చివరి వరకు కొనసాగుతుంది. నట్టల నివారణ మందులు తాపడం వల్ల జీవాల కడుపులో ఉండే అంతరపరాన్న జీవులైన ఏలికపాములు, బద్దెపురుగులు, పొట్టజలగలు, కార్జపు జలగలు నశిస్తాయి. సగటున 2 కిలోలు బరువు పెరుగుతాయి. ఇందువల్ల గొర్రెల పెంపకం దారులకు 10 శాతంపైగా ఆదనపు ఆదాయం వస్తుంది. సన్న జీవాలకు సామూహికంగా నట్టల నివారణ మందులు తాపాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు.

ఎవరూ ఆందోళన చెందకండి

- కప్పట్రాళ్ల ఫారెస్ట్‌లో యురేనియం తవ్వకాల ప్రచారంపై అటవీ అధికారి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎస్.రామచంద్రుడు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల ఫారెస్టులో ఎటువంటి యురేనియం తవ్వకాలు జరగడం లేదని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎస్.రామచంద్రుడు తెలిపారు. యురేనియం తవ్వకాలు జరుగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో ఆదివారం ఆయన కప్పట్రాళ్ల గ్రామంలో పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ ఆదోళన చెందవద్దని రిజర్వ్ ఫారెస్ట్‌లో తవ్వకాలు జరగడం లేద చెప్పారు. ఏదైనా సమాచారం ఉంటే తెలియజేస్తామన్నారు. ఆయన వెంట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బి.రవికుమార్, పత్తికొండ సెక్షన్ అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- తెలంగాణలోని సూర్యాపేట రహదారిపై ఘటన



భరత్, నర్సింహా మృతదేహాలు

దేవరుప్పుల: బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో జనగామ–సూర్యాపేట రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ ఎదురుగా టాటా ఏస్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ సృజన్‌కుమార్ వివరాల మేరకు.. ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని ముగిత గ్రామానికి చెందిన బోయ నర్సింహ (20), తెలంగాణలోని వనపర్తి జిల్లా మదనాపురం గ్రామానికి చెందిన చీరోల్ భరత్ (22) కొడకండ్ల మండలం రామన్నగూడెంలో ఓ ఇంట్లో ప్లంబింగ్ పనులు చేస్తున్నారు. పని నిమిత్తం ఆదివారం ఉదయం బైక్‌పై దేవరుప్పుల మండల కేంద్రానికి వస్తున్నారు. ఈ క్రమంలో సూర్యాపేట రహదారి గొల్లపల్లి బస్‌స్టేజీ సమీపంలో జనగామ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో నర్సింహా, భరత్ అక్కడికక్కడే దుర్మరణం పొందారు. టాటాఏస్‌లో ప్రయాణిస్తున్న సింగరాజుపల్లికి చెందిన రాపాక ఉప్పలయ్య, రేణుక దంపతులు, కొంగరి భాస్కర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిలో లభించిన సెల్ ఫోన్‌ల ఆధారంగా పోలీసులు మృతులను గుర్తించి వారి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. తర్వాత మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బతుకుదెరువు కోసం వెళ్లిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం బాధిత కుటుంబాల్లో విషాదం నింపింది.

ఫార్మసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ఫార్మసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ చెప్పారు. ఆదివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని లెక్చర్ హాల్‌లో ఏపీ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు నుంచి రెగ్యులర్ అయిన 12 మంది ఫార్మసిస్టులకు, ఇటీవల రిటైరైన ఫార్మసీ సూపర్‌వైజర్లు నరసింహారావు, వెంకటేశ్వర్లు గుప్తలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ.. అసోసియేషన్‌కు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఫార్మసిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంట్రాక్టు నుంచి రెగ్యులర్ అయిన పలువురు ఫార్మసిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ అసోసియేషన్ తరపున ఫార్మసిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో పనిచేసే ఫార్మసిస్టులకు జీతాల విషయంలో తేడాలు ఉన్నాయని, ఈ విషయమై ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓస్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ దస్తగిరిరెడ్డి, తాలూకా అధ్యక్షుడు కాశన్న, స్టేట్ ఫార్మసీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.వీ రాంజనేయులు, ఏపీ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రంగస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం.రాజేష్ నాయక్, సహాయ కార్యదర్శి లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు సుబ్బరాయుడి సన్నిధిలో జిల్లా జడ్జి


జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణకు తీర్థప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామి వారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

యాగంటీశ్వరుడి సన్నిధిలో ఏపీఈఆర్‌సీ చైర్మన్


ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డిని సన్మానించి స్వామివారి చిత్ర పటం అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. జస్టిస్ నాగార్జునరెడ్డికి ఈఓ చంద్రుడు ఘన స్వాగతం పలికారు. ఆలయంలోని ఏక శిలారూపంలో కొలువైన శివ పార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం నాగార్జునరెడ్డిని పూలమాల దుశ్శాలువాతో సన్మానించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

తండ్రి మృతిని జీర్ణించుకోలేక కుమారుడి బలవన్మరణం

నంద్యాల: తండ్రి మృతి చెందడంతో మనోవేదనకు గురైన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. విశ్వనగర్‌కు చెందిన గోపాల్‌కు ప్రవీణ్‌కుమార్(29), గణేష్ కుమారులు. ఏడాది క్రితం అనారోగ్యంతో గోపాల్ మృతి చెందాడు. తండ్రి మృతిని జీర్ణించుకోలేని ప్రవీణ్‌కుమార్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో ఆదివారం కల్లాపి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేస్ నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు టూటౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపారు.

యువతి అదృశ్యం


అఖిల(ఫైల్)

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నందుల పెద్ద సుంకన్న కుమార్తె అఖిల అనంతరపురం జిల్లా తాడపత్రిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో బీటెక్ చదువుతోంది. వ్యక్తిగత కారణాలతో ఏడాది క్రితం కాలేజీ మానుకుని ఇంటి వద్దే ఉంటోంది. ఈనెల 19న ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. కాగా అఖిల ఇంటర్ చదివే సమయంలో అవుకు మండలం బెలుం గ్రామనికి చెందిన ఓ యువకుడితో పరిచయం ఉండేది. అతడే తమ అమ్మాయిని తీసుకుని వెళ్లి ఉంటాడని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

మద్యానికి బానిసై ..

అవుకు: మద్యానికి బానిస అయిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన వడ్డె మహేష్(32) కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. ఈక్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య రాజ్యలక్ష్మి, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టైపిస్టు రాష్ట్ర అసోసియేషన్‌లో జిల్లాకు ప్రాధాన్యత


నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అసోసియేషన్ నేతలు

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ టైపిస్టు అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో కర్నూలు జిల్లాకు ప్రాధాన్యత పెరిగింది. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో అసోసియేషన్‌లో మూడు కీలకమైన పోస్టులను కర్నూలు జిల్లా నేతలు కైవసం చేసుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లా వ్యవసాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న టీసీ శంకర్‌నాయక్ నియమితులయ్యారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా విభాగం క్వాలిటీ కంట్రోల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న టీ బ్రహ్మానందరెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, జిల్లా ఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న జీ మహమ్మద్ ఆలీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఎన్నికలను పీ శివ రామక్రిష్ణ నిర్వహించగా, సీ హెచ్ నాగభూషణం ఎన్నికల ఫలితాలను ప్రకటించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న టైపిస్టులు, స్టెనోగ్రాఫర్స్ సమస్యలను పరిష్కరించేందుకు అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వంతో పోరాటం నిర్వహించైనా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.